

వర్షాలకు కూలిన ఇళ్లు

కురుస్తున్న వర్షాలకు ఉమ్మడి జిల్లాలో పలుచోట్ల ఇళ్లు కూలిపోయాయి.

వివరాలు 8లో ▸



కూలిన వాటర్‌గ్రిడ్ పైపులైన్

అయిజ వాగుపై హైలెవల్ బ్రిడ్జి నిర్మాణంతో వాటర్ గ్రిడ్ పైపులు దెబ్బతిన్నాయి.

వివరాలు 10లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
27.2 /22.7

రోజంతా ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ముసురు వర్షంతో పాటు అప్పుడప్పుడు ఓ మోస్తారు నుంచి భారీ వర్షం కురవచ్చు.

ప్రగతికి తొలిమెట్టు



వనపర్తిలోని వల్లభ్‌నగర్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు బోధిస్తున్న ఉపాధ్యాయుడు (ఫైల్)

విద్యార్థుల్లో కనీస సామర్థ్యాలు పెంపే లక్ష్యంగా..

- వచ్చే వారం జిల్లాస్థాయిలో ఉపాధ్యాయులకు శిక్షణ
- విద్యార్థులు తెలుగు, ఆంగ్లం, గణితంలో పట్టు సాధించేలా చర్యలు

వనపర్తిటౌన్: విద్యార్థులకు ప్రాథమిక స్థాయిలోనే సరైన బోధన అందితే ఆయా సబ్జెక్టుల్లో ప్రావీణ్యం సంపాదించే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం జిల్లాలోని 359 ప్రాథమిక పాఠశాలల్లో సుమారు 28 వేల మంది విద్యార్థులు ఒకటి నుంచి 5వ తరగతి వరకు చదువుతున్నారు. వీరు ప్రతి ఏటా పై తరగతులకు వెళ్తున్నా.. కనీస సామర్థ్యాలు మెరుగుపడటం లేదు. ఈ విషయాన్ని గుర్తించిన ప్రభుత్వం కనీస సామర్థ్యాలు, నైపుణ్యాలు పెంపొందించాలని నిర్ణయించింది. ఇందుకు 'తొలిమెట్టు' కార్యక్రమాన్ని రూపొందించి అమలుకు శ్రీకారం చుట్టింది. పలువురు ఉపాధ్యాయులను ఎంపికచేసి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు పాఠ్యాంశాల బోధన, అభ్యసనాలపై రాష్ట్రస్థాయిలో శిక్షణ తరగతులు నిర్వహించారు. ప్రస్తుతం శిక్షణ పొందిన ఉపాధ్యాయులు జిల్లాస్థాయిలో ఉపాధ్యాయులకు నేర్చుకున్న అంశాలను వివరించి అవగాహన కల్పించనున్నారు.

మూడురోజులు పాటు..

పాఠశాల నిర్వహణకు ఇబ్బందులు కలగకుండా ప్రతి మండలం నుంచి తెలుగు, ఆంగ్లం, గణితం సబ్జెక్టుల ఉపాధ్యాయులు ఇద్దరు చొప్పున జిల్లాలోని 14 మండలాల నుంచి 84 మంది ఉపాధ్యాయులు శిక్షణకు హాజరుకానున్నారు. ఇలా మూడురోజుల పాటు 252 మంది ఉపాధ్యాయులు శిక్షణ పొందనున్నట్లు విద్యాశాఖ వర్గాలు తెలిపాయి. శిక్షణ తరగతులు ఈ నెల 24 నుంచి మూడురోజుల పాటు కొనసాగనున్నాయి. ఇక్కడ శిక్షణ పొందిన ఉపాధ్యాయులు ఆయా మండలాల్లో సబ్జెక్టుల వారీగా రీసోర్స్ పర్సన్స్ (ఆర్పీలు)గా కొనసాగనున్నారు. మండలస్థాయిలో సబ్జెక్టుల ఉపాధ్యాయులకు శిక్షణ పూర్తయిన తర్వాత పాఠశాలల్లో విద్యార్థుల కనీస సామర్థ్యాల పెంపుపై దృష్టి సారించనున్నారు.

సామర్థ్యాల పెంపునకే..



విద్యార్థుల్లో కనీస సామర్థ్యాలు పెంపొందించేందుకు ప్రభుత్వం 'తొలిమెట్టు' కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఈ నెల 24 నుంచి మూడురోజుల పాటు జిల్లాస్థాయిలో సబ్జెక్టుకు ఇద్దరు ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వనున్నాం. ఆయా ఉపాధ్యాయులు మండలస్థాయిలోని ఉపాధ్యాయులకు శిక్షణనిస్తారు.

– గోవిందరాజులు, ఇన్‌చార్జ్ డీఈఓ

జిల్లాలో ఇలా..

ప్రాథమిక పాఠశాలలు	విద్యార్థులు
359	28 వేలు

ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులు
1,300 (సుమారుగా..)

మూడు సబ్జెక్టులపైనే..

విద్యార్థులు ప్రాథమిక స్థాయిలోనే తెలుగు, ఆంగ్లం, గణితంపై పట్టు సాధిస్తే పైతరగతుల్లో ఎలాంటి ఇబ్బందులు ఉండవనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. తెలుగులో సామర్థ్యాలు పెంపొందితే ఈవీఎస్(పర్యావరణ), సామాన్య, సాంఘిక శాస్త్రలను సైతం అర్థం చేసుకునే ఆస్కారం ఉంటుంది. గణిత మూలాలు నేర్పించడంతో తరగతుల స్థాయి పెరిగే కొద్ది సబ్జెక్టుపై ఆసక్తి పెరుగుతుంది. ప్రస్తుత పోటీ ప్రపంచంలో రాణించాలంటే ఆంగ్లంలో పట్టు సాధించాలి. కాబట్టి శిక్షణ పొందిన ఉపాధ్యాయులు త్వరలోనే విద్యార్థులకు ఆయా సబ్జెక్టుల్లో కనీస సామర్థ్యాలు పెంచేలా విద్య అందించనున్నారు.

నాణ్యమైన విద్యుత్‌కే సబ్‌స్టేషన్ల ఏర్పాటు



గుమ్మడంలో విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ప్రారంభిస్తున్న మంత్రి నిరంజన్‌రెడ్డి, చిత్రంలో అదనపు కలెక్టర్ తిరుపతిరావు తదితరులు

- రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

ఖిల్లాఘనపురం: నాణ్యమైన విద్యుత్ సరఫరాకే అవసరమైన ప్రాంతాల్లో సబ్‌స్టేషన్లు ఏర్పాటు చేస్తున్నామని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని మానాజీపేటలో నూతనంగా ఏర్పాటు చేసిన 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ఆయన ప్రారంభించారు. అదేవిధంగా రూ.10 లక్షల ఎస్‌డీఎఫ్ నిధులతో నిర్మించనున్న గౌడ సంఘం కమ్యూనిటీ హాల్, రూ.5 లక్షల సీడీపీ నిధులు, రూ.5 లక్షల ఎస్‌డీఎఫ్ నిధులతో నిర్మించనున్న రజక సంఘం కమ్యూనిటీ హాల్, రూ.5 లక్షల జెడ్పీ నిధులు, రూ.4 లక్షల ఎస్‌డీఎఫ్ నిధులతో నిర్మించనున్న పశు వైద్యశాల భవనానికి ఎంపీపీ కృష్ణానాయక్, జెడ్పీటీసీ సభ్యుడు సామ్యానాయక్, సర్పంచ్ సతీష్‌కుమార్‌తో కలిసి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడారు. ఉమ్మడి రాష్ట్రంలో నాణ్యమైన విద్యుత్ అందక రైతులు ఇబ్బందులు పడ్డారని.. ప్రత్యేక రాష్ట్రం సాధించుకున్న తర్వాత రైతులకు నిరంతర ఉచిత విద్యుత్ అందిస్తున్నామన్నారు. మానాజీపేటలో పశువైద్యశాల ఏర్పాటు చేయడంతో పాడి రైతులకు ఉపయోగంగా ఉంటుందని చెప్పారు. అదేవిధంగా అనారోగ్యంతో బాధపడుతున్న గ్రామానికి చెందిన ప్రతాప్ లింగంను మంత్రి పరామర్శించారు. కార్యక్రమంలో మండల రైతు సమితి కో–ఆర్డినేటర్ వెంకటేశ్వర్‌రావు, జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ లక్ష్మారెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రాళ్ల కృష్ణయ్య, ఎంపీటీసీ సభ్యుడు నాగయ్య, జిల్లా రజక సంఘం అధ్యక్షుడు విజయ్‌కుమార్, మండలంలోని వివిధ గ్రామాల నాయకులు, కార్యకర్తలు విద్యుత్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

గుమ్మడంలో..

పెబ్బేరు: మండలంలోని గుమ్మడం గ్రామంలో 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌ను మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) తిరుపతిరావు, విద్యుత్ అధికారులు శుక్రవారం ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. శ్రీశైలం ముంపు నిర్వాసితులకు జీఓనంబర్ 98 ప్రకారం 100 మందికిపైగా ఉద్యోగాలు ఇప్పించేందుకు కృషి చేస్తామన్నారు. అలాగే డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణాల్లో వేగం పెంచి త్వరగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వివిధ పార్టీలకు చెందిన సుమారు 200 మంది కార్యకర్తలు మంత్రి నిరంజర్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. సర్పంచ్ సువర్ణ, డీఈ నరేందర్‌కుమార్, ఏడీ వేణు, పీఆర్‌ఈ రామలింగారెడ్డి, ఏఈ కవిత, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, నాయకులు, గౌని బుచ్చారెడ్డి, విక్రంగౌడ్, ప్రభాకర్‌గౌడ్, మహేశ్వర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ సేవలు సద్వినియోగం చేసుకోవాలి

పెబ్బేరు: ప్రైవేటు ఆస్పత్రుల్లో ఆరోగ్యశ్రీ సేవలను రోగులు సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని శ్రీ సరోజిని మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో ఆరోగ్యశ్రీ సేవలు, డయాలసిస్ కేంద్రాన్ని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) తిరుపతిరావుతో కలిసి మంత్రి ప్రారంభించారు. అనంతరం పట్టణంలోని మసీదులో పీర్లను దర్శించుకున్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ కరుణశ్రీ, జెడ్పీటీసీ సభ్యురాలు పద్మ, మాజీ జెడ్పీ చైర్మన్ బండారి భాస్కర్, మున్సిపల్ వైస్ చైర్మన్ కర్రెస్వామి, సింగిల్‌విండో అధ్యక్షుడు గౌని కోదండరామిరెడ్డి, మున్సిపల్ కమిషనర్ ఆదిశేషు, తహసీల్దార్ అబ్రహం లింకన్, ఆస్పత్రి యాజమాన్యం లావణ్య, రంగారెడ్డి, డా. భరత్‌కుమార్‌రెడ్డి, డా. సాయిశ్రీ, బలరాం నాయుడు, భారతి తదితరులు పాల్గొన్నారు.

ఆగస్టు నెలాఖరుకు పనులు పూర్తి



'మన ఊరు - మన బడి' సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

- కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

వనపర్తి: జిల్లాలో కొనసాగుతున్న 'మన ఊరు – మన బడి' మొదటి విడత అభివృద్ధి పనులు ఆగస్టు నెలాఖరు నాటికి పూర్తి చేయాలని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఆదేశించారు. శుక్రవారం ఈ అంశంపై సమీకృత కలెక్టరేట్‌లో ఇంజినీరింగ్, విద్యాశాఖ అధికారులతో నిర్వహించిన సమీక్షలో ఆయన పాల్గొని మాట్లాడారు. మరమ్మతులు, నిర్మాణాల్లో ఏమైనా సమస్యలుంటే అక్కడికక్కడే మండల అధికారులతో చర్చించి పరిష్కరించుకోవాలని సూచించారు. ఖిల్లాఘనపురం మండలం పడమటి తండా పాఠశాల నిర్మాణానికి స్థల సమస్యను వెంటనే పరిష్కరించాలని, జిల్లాకేంద్రంలోని జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. పెబ్బేరులో పాఠశాల భవనాల నిర్మాణంలో జాప్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పనులు త్వరగా పూర్తి చేయాలని, నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. పాన్‌గల్ జెడ్పీ ఉన్నత పాఠశాల, మండలంలోని శాఖాపూర్, శేర్‌పల్లి తదితర ప్రాంతాల్లోని పాఠశాలల్లో నెలకొన్న చిన్న చిన్న సమస్యలను గ్రామంలోనే చర్చించుకొని పరిష్కరించాలని సూచించారు. భూమి కేటాయింపులు, బదలాయింపుల్లో నిబంధనలు పాటించాలన్నారు.

బీఎల్వోలదే కీలక పాత్ర..

ఓటరు జాబితా తయారీలో బీఎల్వోలదే కీలక పాత్రని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. శుక్రవారం ఆర్డీఓ కార్యాలయంలో వనపర్తి పురపాలికలోని బీఎల్వోల సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. పెండింగ్ దరఖాస్తులు, డ్రాఫ్ట్ ఓటరు జాబితా రూపకల్పన పకడ్బందీగా చేపట్టాలని సూచించారు. ఓటరు జాబితా నుంచి తొలగించిన ఓటర్ల వివరాలను క్షేత్రస్థాయిలో ధ్రువీకరించుకోవాలని, ఇంటింటి సర్వే, ఆన్‌లైన్ దరఖాస్తుల పరిశీలన జూలై 27 నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు. ఓటరు జాబితా నుంచి తొలగించాల్సిన వాటికి గల కారణాలను స్పష్టంగా తెలియజేయాలన్నారు.

సేవలు ప్రశంసనీయం..



జిల్లా అదనపు కలెక్టర్‌గా సుదీర్ఘకాలం పనిచేసిన డి.వేణుగోపాల్ సేవలు ప్రశంసనీయమని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ కొనియాడారు. ములుగు జిల్లాకు బదిలీపై వెళ్తున్న అదనపు కలెక్టర్ వీడ్కోలు సమావేశాన్ని శుక్రవారం కలెక్టరేట్‌లో నిర్వహించగా.. కలెక్టర్ హాజరై మాట్లాడారు. ఏ కార్యక్రమం చేపట్టినా తమవంతు కృషి చేసి విజయవంతంగా పూర్తి చేసేవారని గుర్తుచేశారు. అదనపు కలెక్టర్ ఎస్.తిరుపతిరావు, ఆర్డీఓ పద్మావతి, సీపీఓ వెంకటరమణ పాల్గొన్నారు.

వేరుశనగ క్వింటా రూ.7,399

గద్వాల వ్యవసాయం: గద్వాల మార్కెట్ యార్డుకు శుక్రవారం 70క్వింటాళ్ల వేరుశనగ రాగా, క్వింటాకు గరిష్టం రూ.7339, కనిష్టం రూ.4359, సరాసరి రూ. 5859 ధరలు లభించాయి.

పంచాయతీ కార్మికుల కలెక్టరేట్ ముట్టడి



ఆందోళనలో పాల్గొన్న గ్రామపంచాయతీ కార్మికులు

వనపర్తి: తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలంటూ శుక్రవారం గ్రామపంచాయతీ కార్మికులు కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపట్టారు. తెలంగాణ గ్రామపంచాయతీ ఉద్యోగ, కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ ధర్నాలో జేఏసీ రాష్ట్ర కన్వీనర్ పి.అరుణ్ కుమార్, సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యుడు పుట్టా ఆంజనేయులు పాల్గొని కార్మికులకు మద్దతు తెలిపి మాట్లాడారు. స్వచ్ఛ తెలంగాణ ఏర్పాటులో క్రియాశీల పాత్ర పోషిస్తు, జనారోగ్యం కోసం తమ ఆరోగ్యాన్ని ఫణంగా పెట్టి కార్మికులు పని చేస్తున్నారని తెలిపారు. జీఓనంబర్ 60 ప్రకారం కార్మికులకు రూ.15,600, కారోబార్, బిల్ కలెక్టర్, ట్రాక్టర్ డ్రైవర్లకు రూ.19,500 వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఏళ్లుగా పనిచేస్తున్నా.. కనీస వేతన చట్టం అమలుకు నోచుకోవటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. డిమాండ్లు పరిష్కరించకుంటే రాష్ట్రవ్యాప్తంగా కార్మికులను సమీకరించి రాష్ట్ర సచివాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. అనంతరం డిమాండ్ల వినతిపత్రాన్ని ఏఓ భానుప్రకాష్‌కు అందజేశారు.

కోయిల్‌సాగర్ లింక్ కెనాల్ భూమి స్వాధీనం



సర్వే నంబర్ 52లో కాల్వ తీస్తున్న పొక్లెయిన్

- కలెక్టర్ ఆదేశాలతో కదిలిన అధికార యంత్రాంగం
- సర్వే నం.52, 87, 731లో చేసిన వెంచర్లలో హద్దుల గుర్తింపు

సాక్షి ఎఫెక్ట్..

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: కోయిల్‌సాగర్ లింక్ కెనాల్ భూమిని అధికారులు తిరిగి స్వాధీనం చేసుకున్నారు. లింక్ కెనాల్ కోసం రైతుల వద్ద ప్రభుత్వం సేకరించిన స్థలం అన్యాక్రాంతంపై ఈ నెల 19న 'లింక్ కెనాల్‌ను మింగేశారు' శీర్షికన 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. దీనిపై నారాయణపేట కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశాల మేరకు రెవెన్యూ, నీటి పారుదల శాఖ అధికారులు శుక్రవారం క్షేత్రస్థాయి పరిశీలన జరిపారు. ఆర్డీఓ రామచందర్, నీటి పారుదల శాఖ ఈఈ ప్రతాప్‌సింగ్, భూసేకరణ డిప్యూటీ కలెక్టర్ తాను, నీటి పారుదల శాఖ డీఈఈ కిరణ్‌కుమార్, తహసీల్దార్ రాంకోటి మరికల్ శివారులోని డీ5 కెనాల్ నుంచి ఎం–1 లింక్ కెనాల్ కోసం సేకరించిన సర్వే నంబర్లను పరిశీలించారు. నీటి పారుదల శాఖ నుంచి ఎన్‌ఓసీ తీసుకోకుండా డీటీసీపీ నాలా ప్రకారం లే అవుట్ చేసినట్లు అధికారులు తేల్చారు. మరికల్, పస్పుల వరకు లింక్ కెనాల్ కోసం సేకరించిన భూమిని పరిశీలించిన అనంతరం 52, 87, 731 సర్వే నంబర్లలో నిబంధనలకు విరుద్ధంగా వెంచర్లు వెలిశాయని గుర్తించారు. వీటిలో రాయిచూర్ రోడ్డు నుంచి 50 ఫీట్ల దూరంలో ఉన్న లింక్ కెనాల్ స్థలాన్ని పొక్లెయిన్‌తో హద్దులు ఏర్పాటు చేశారు. అన్యాక్రాంతమైన 15 నుంచి 20 మీటర్ల వరకు ఉన్న లింక్ కెనాల్ భూమిని అధికారులు స్వాధీనం చేసుకోవడానికి చర్యలు తీసుకోవడంతో రియల్ వ్యాపారుల్లో ఆందోళన నెలకొంది



అన్యాక్రాంతమైన లింక్ కెనాల్ స్థలం వివరాలను సేకరిస్తున్న అధికారులు

కలెక్టర్‌కు నివేదిస్తాం..

అన్యాక్రాంతమైన ఎం–1 లింక్ కెనాల్ స్థలం హద్దులను గుర్తించి కలెక్టర్‌కు నివేదిక అందజేస్తాం. ఆ తర్వాత కలెక్టర్ ఆదేశాల మేరకు టెండర్ వేసి కాల్వ పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటాం. ప్రస్తుతం 52, 87, 731 సర్వే నంబర్లలో ఆక్రమించుకున్న లింక్ కెనాల్ స్థలాన్ని స్వాధీనం చేసుకుని హద్దులు ఏర్పాటు చేశాం.

– ప్రతాప్‌సింగ్, ఈఈ, నీటిపారుదలశాఖ

స్తంభించిన జన జీవనం

- నాలుగోరోజు కురిసిన వర్షం
- జిల్లావ్యాప్తంగా 44.8 మి.మీ. వర్షపాతం నమోదు
- శనివారం కూడా పాఠశాలలకు సెలవు ప్రకటించిన ప్రభుత్వం



ఆత్మకూర్‌లో రహదారిపై నిలిచిన వర్షపు నీరు

అమరచింత: జిల్లావ్యాప్తంగా నాలుగు రోజులుగా ఓ మోస్తారు నుంచి భారీ వర్షాలు కురుస్తుండటంతో జన జీవనం స్తంభించింది. రోజుకూలీ పనులు చేసుకొని జీవనం సాగించే వారికి ఉపాధి దూరమైంది. శుక్రవారం కూడా రహదారులపై జన సంచారం, వాహన రాకపోకలు తగ్గిపోయాయి. గ్రామాల్లో రైతులు పొలం పనుల్లో నిమగ్నమయ్యారు. వరి సాగుచేసే రైతులు వర్షపు నీటికి కరిగెట్లు, నారు వేసే పనులు చేసుకోవడం కనిపించింది. వర్షాల కారణంగా కలెక్టర్ ఆదేశాల మేరకు పట్టణాలు, పుర కేంద్రాల్లో హెల్ప్‌లైన్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. శిథిలావస్థకు చేరిన ఇళ్లల్లో ఉండొద్దని, సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలంటూ సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో చాటింపులు వేయిస్తున్నారు. జిల్లావ్యాప్తంగా శుక్రవారం 44.8 మి.మీ. వర్షపాతం నమోదైనట్లు వాతావరణశాఖ అధికారులు తెలిపారు.

మండలాల వారీగా శుక్రవారం నమోదైన వర్షపాతం

మండలం	వర్షపాతం (మి.మీ.లలో..)
ఖిల్లా ఘనపురం	63.1
పెద్దమందడి	56.1
ఆత్మకూర్	56.1
అమరచింత	54.4
పెబ్బేరు	51.3
కొత్తకోట	48.5
వనపర్తి	47.3
మదనాపురం	43.7
గోపాల్‌పేట	43.4
రేవల్లి	40.3
శ్రీరంగాపురం	36.6
వీపనగండ్ల	30.6
చిన్నంబావి	29.5
పాన్‌గల్	25.8

న్యూస్‌రీల్

ముసురు వర్షాలతో జాగ్రత్త



వీపనగండ్ల: ముసురు వర్షాలతో సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని.. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డిప్యూటీ డీఎంహెచ్ఓ డా. శ్రీనివాసులు కోరారు. శుక్రవారం మండలంలోని వల్లభాపురం గ్రామంలో సర్పంచ్ రావుల రవీందర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పరిసరాలు శుభ్రంగా లేకపోతే మలేరియా, డెంగీ తదితర వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని.. ఆరోగ్య సిబ్బంది, ప్రజాప్రతినిధులు సమన్వయంతో గ్రామాలను స్వచ్ఛంగా ఉంచాలని సూచించారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి డా. వంశీకృష్ణ, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రైతులను ఇబ్బందులకు గురిచేయొద్దు



గోపాల్‌పేట: విద్యుత్ సరఫరాలో అంతరాయాలు కలిగిస్తూ రైతులను ఇబ్బందులకు గురిచేయొద్దని మాజీ మంత్రి, కాంగ్రెస్‌పార్టీ క్రమశిక్షణ సంఘం చైర్మన్ డా. చిన్నారెడ్డి కోరారు. శుక్రవారం మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్‌ను ఆయన సందర్శించి రెండ్రోజులుగా విద్యుత్ సరఫరా ఎందుకు సరిగా కావడం లేదని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఏఈ నర్సింహులుకు ఫోన్‌చేసి రైతుల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయని.. సరఫరాలో అవాంతరాలు లేకుండా చూడాలని కోరారు. అనంతరం మండలంలోని పొలికెపాడు, జింకలబీడు తండా, ఆముదాలకుంట తండా, లక్ష్మీదేవిపల్లి, చాకల్‌పల్లి, గోపాల్‌పేట, ఎర్రగట్టుతండా, రేకులగడ్డ, దేవరగట్టు తండాలో గ్రామ కార్యవర్గాలను ఎన్నుకున్నారు. పార్టీ బలోపేతానికి అందరూ కష్టపడి పనిచేయాలని తెలిపారు. కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే రైతులకు రూ.రెండు లక్షల పంట రుణమాఫీ, రెండు లక్షల ఉద్యోగాల భర్తీ, పేదల ఇళ్ల నిర్మాణానికి రూ. అయిదు లక్షలు, రూ.500కే సిలిండర్ ఇస్తామని హామీ ఇచ్చారు. డీసీసీ అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్, ఓబీసీ జిల్లా అధ్యక్షుడు కోట్ల రవి, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు కొంకి వెంకటేష్, మాజీ జెడ్పీటీసీ రాజేశ్వర్‌రెడి పాల్గొన్నారు.

ఆగస్టు 4న 'కార్మిక గర్జన'



అమరచింత: కార్మికుల సమస్యల సాధనకు ఆగస్టు 4న హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద కార్మిక గర్జన నిర్వహిస్తున్నట్లు ఇఫ్టూ జిల్లా కోశాధికారి రాజు తెలిపారు. శుక్రవారం పట్టణంలోని మార్క్స్ భవనంలో కార్మిక గర్జన వాల్ పోస్టర్లను విడుదల చేసి మాట్లాడారు. కార్మికులు సామాజిక భద్రత లేని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సఫాయి అన్నా.. సలామంటూ పోజిలిస్తున్న ప్రధాని మోదీ, సీఎం కేసీఆర్ వారి జీవితాల్లో వెలుగులు నింపడం లేదన్నారు. కార్మికుల ఆకలి కేకలు వినిపించని పరిస్థితిలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో 20 లక్షల మంది భవన నిర్మాణ కార్మికులు, పురపాలికలో 50 వేలు, గ్రామపంచాయతీల్లో 60 వేలు, విద్యుత్ కార్మికులు 25 వేల మంది ఉన్నారని వివరించారు. ఏళ్లుగా ఆయా రంగాల్లో పని చేస్తున్న కార్మికులకు ప్రభుత్వాలు ఎలాంటి సంక్షేమ పథకాలు అమలు చేయకపోవడం శోచనీయన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి నిర్వహించే కార్యక్రమంలో ప్రతి రంగానికి చెందిన కార్మికులు అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సామేల్, భక్తరాజ్, ప్రేమరత్నం, జిలాని, మహమూద్ తదితరులు పాల్గొన్నారు.

కోయిల్‌సాగర్‌లో 20 అడుగుల నీటిమట్టం

దేవరకద్ర: కురుస్తున్న భారీ వర్షాలకు కోయిల్‌సాగర్ ప్రాజెక్టులో నీటిమట్టం రోజురోజుకూ పెరుగుతోంది. శుక్రవారం ఉదయం నుంచి పెద్ద వాగు ప్రవాహం ప్రారంభం కావడంతో సాయంత్రం వరకు 20 అడుగులకు చేరింది. పాత అలుగు 26.6 అడుగులు కాగా.. మరో 6.6 అడుగుల నీరు వస్తే పాత అలుగు స్థాయికి చేరుకుంటుంది. గేట్ల స్థాయి వరకు 32.6 అడుగులు కాగా.. మరో 12.6 అడుగులు రావాల్సి ఉంది.

క్లుప్తంగా

విద్యుదాఘాతంతో రైతు మృతి

నాగర్‌కర్నూల్ క్రైం: విద్యుదాఘాతంతో రైతు మృతి చెందిన ఘటన మండల పరిధిలోని పెద్దాపూర్‌లో శుక్రవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ విజయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దాపూర్‌కు చెందిన నిరంజన్ (50) తన వ్యవసాయ పొలంలో బోరు మోటరు ఆన్‌చేసేందుకు వెళ్లాడు. విద్యుత్ తీగలు తెలుకొని ఉండడంతో ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. గమనించిన కుటుంబ సభ్యులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జనరల్ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. అతనికి భార్య, కూతరు, కుమారుడు ఉన్నారు. అతని భార్య చెన్నమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

రియల్ వ్యాపారి ఆత్మహత్య


రాకేశ్‌రెడ్డి(ఫైల్)

జడ్చర్ల: ఆర్థిక ఇబ్బందులు తాళలేక రైలు కింద పడి రియల్ ఎస్టేట్ వ్యాపారి ఆత్మహత్య చేసుకున్న ఘటన శుక్రవారం గొల్లపల్లి రైల్వే స్టేషన్ పరిధిలో కావేరమ్మపేట వద్ద చోటుచేసుకుంది. రైల్వే హెడ్ కానిస్టేబుల్ కృష్ణ కథనం మేరకు.. నాగర్‌కర్నూల్ జిల్లా తెల్కపల్లి మండలం దాసుపల్లికి చెందిన చిమర్ల రాకేశ్‌రెడ్డి(38) హైదరాబాద్‌లో రియల్ వ్యాపారం చేస్తున్నాడు. ఇటీవల వ్యాపారం ముందుకు సాగడం లేదు. ఆర్థిక ఇబ్బందులతో సతమతమయ్యాడు. దీంతో రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బాదేపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

ఉరేసుకుని నవవధువు..

బిజినేపల్లి: తిమ్మాజిపేట మండలంలోని నేరేళ్లపల్లికి చెందిన నవవధువు ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. తలకొండపల్లి మండలంలోని రాంపూర్‌కి చెందిన శిరీష(21)ను తిమ్మాజిపేట మండలంలోని నేరేళ్లపల్లికి చెందిన శివకుమార్‌కు ఇచ్చి రెండు నెలల క్రితం వివాహం చేశారు. శివకుమార్ తండ్రి శుక్రవారం మధ్యాహ్నం బయటి నుంచి ఇంట్లోకి వచ్చి చూడగా.. తన కోడలు ఉరేసుకుని కనిపించింది. వెంటనే స్థానికుల సాయంతో మృతదేహాన్ని కిందకు దింపేసరికి చనిపోయినట్లు నిర్ధారించారు. విషయం తెలుసుకుని ఆమె తల్లిదండ్రులు నేరేళ్లపల్లికి హుటాహుటిన చేరుకున్నారు. కాగా నవవధువు తన భర్త శివకుమార్‌తో చివరికాల్ మాట్లాడినట్లు సమాచారం. ఆత్మహత్యకు గల కారణాలు ఇంకా తెలియరాలేదు. ఈ విషయమై ఎస్‌ఐ షేక్ శంషొద్దీన్‌ను వివరణ కోరగా.. తమకు ఎలాంటి సమాచారం లేదన్నారు.

ఉరేసుకొని యువతి..


సునంద(ఫైల్)

ధరూరు: కడుపునొప్పి భరించలేక యువతి ఆత్మహత్య చేసుకున్న ఘటన శుక్రవారం ధరూరులో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన కీ.శే.సంకటి చిన్నదేవన్న, జయమ్మలకు కుమార్తె, కుమారుడు ఉన్నారు. కుమార్తె సునంద(23) డిగ్రీ వరకు చదుకున్నది. ప్రస్తుతం హైదరాబాద్‌లోని ప్రైవేట్ నర్సింగ్ కళాశాలలో చదువుతోంది. ఇటీవల ధరూరుకు వచ్చిన యువతి గురువారం రాత్రి కడుపు నొప్పి భరించలేక ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యా యత్నానికి పాల్పడింది. దీన్ని గమనించిన కుటుంబ సభ్యులు ఆమెను వెంటనే గద్వాల ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆమె మృతి చెందింది. సాయంత్రం పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఆమె తల్లి జయమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శివానందంగౌడ్ తెలిపారు.

పురుగులమందు తాగి బలవన్మరణం


గోపాల్‌పేట: పురుగుల మందు తాగి వ్యక్తి బలవన్మరణానికి పాల్పడిన ఘటన రేవల్లి మండలంలోని చెన్నారంలో శుక్రవారం చోటుచేసుకుంది. రేవల్లి ఎస్‌ఐ శివకుమార్ వివరాల ప్రకారం.. రేవల్లి మండలంలోని చెన్నారం గ్రామానికి చెందిన సాయిరెడ్డి, పద్మలకు ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు. ఇద్దరు కూతుళ్లకు పెళ్లైయింది. కుమారుడు కిషన్‌రెడ్డికి పెళ్లి కాలేదు. గత సోమవారం కిషన్‌రెడ్డి కుటుంబ సభ్యులతో గొడవ పడి, ఇంట్లో చెప్పకుండా బయటి కెళ్లిపోయాడు. గతంలో ఇలాగే గొడవైనప్పుడల్లా తమ అక్క దగ్గరికో, చెల్లి దగ్గరికో వెళ్లి రెండు రోజుల తర్వాత వచ్చేవాడు. ఇప్పుడు అలాగే వెళ్లి ఉంటాడని తల్లిదండ్రులు భావించారు. శుక్రవారం సాయిరెడ్డి పాత ఇంటిదగ్గర ఏదో వాసన వస్తుందని చుట్టుపక్కల వారు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. దీంతో వాళ్లు ఇంట్లోకెళ్లి చూడగా కిషన్‌రెడ్డి మృతదేహం, పక్కనే పురుగుల మందు డబ్బా కనిపించింది. ఈ విషయం తెలిసిన వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. తండ్రి సాయిరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.


మహమ్మదాబాద్ మండలం మంగంపేటలో..


బాలానగర్ మండలం సేరిగూడలో కూలిన ఇంటి పైకప్పు

కురిసిన వర్షం.. కూలిన ఇళ్లు


నవాబ్‌పేట మండలం కేశవరావుపల్లిలో కూలిన ఇల్లు


కోస్గి మండలం ముక్తిపాడులో కూలిన గోడ వద్ద బాధితుడు అంజయ్య

రాజాపూర్/మహమ్మదాబాద్/నవాబుపేట/ఊట్కూర్/కోస్గి: మూడురోజులుగా కురుస్తున్న వర్షాలకు ఉమ్మడి జిల్లాలోని పలు గ్రామాల్లో పలువురి ఇళ్లు పాక్షికంగా, మరికొందరికి పూర్తిగా కూలిపోయాయి. ఎక్కడా ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. శుక్రవారం ఉదయం అధికారులు ఇళ్లను పరిశీలించి వివరాలు సేకరించారు. శిథిలావస్థలో ఉన్న ఇళ్లను ఖాళీ చేసి సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని ఆయా కుటుంబాలకు సూచించారు.

■ రాజాపూర్ మండలం తిర్మలాపూర్‌లో యాదగిరి ఇల్లు, రంగారెడ్డిగూడలో కాటిపాగ వాణి ఇంటి వెనుకభాగం, ఈద్గాన్‌పల్లిలో బైండ్ల ఇస్తారి ఇల్లు కూలింది. ఆర్‌ఐ ఖదీర్ కూలిన ఇళ్లను పరిశీలించారు.

■ మహమ్మదాబాద్ మండలం మంగంపేటలో వడ్డె బాలయ్య ఇల్లు పడిపోయింది.

■ నవాబుపేట మండలంలోని వివిధ గ్రామాల్లో 5 ఇళ్లు పాక్షికంగా కూలినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. నష్టం వివరాలను సేకరిస్తున్నట్లు తహసీల్దార్ రాజేందర్‌రెడ్డి చెప్పారు.

■ బాలానగర్ మండలం పెద్దాయపల్లి పరిధి సేరిగూడలో గొల్ల మల్లేష్ పెంకుటిల్లు పైకప్పు కూలింది. సర్పంచ్ శంకరప్ప ఇంటిని పరిశీలించి ప్రభుత్వ పరంగా ఆదుకోవాలని తహసీల్దార్ శ్రీనివాస్‌కు విన్నవించారు.

■ ఊట్కూర్ మండలం చిన్నపొర్లలో శుక్రవారం తెల్లవారుజామున చేనేత కార్మికురాలు కోస్మి యశోదమ్మ మట్టి ఇల్లు కూలింది. ఎంపీటీసీ సభ్యుడు రవిప్రసాద్‌రెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించి ప్రభుత్వ పరంగా ఆర్థిక సాయం అందించేందుకు ప్రయత్నిస్తానని హామీ ఇచ్చారు.

■ కోస్గి మండలం ముక్తిపాడ్‌లో రంగారెడ్డిపల్లి అంజయ్య పురాతన ఇల్లు వెనుక భాగం కూలిపడింది.


రాజాపూర్ మండలం రంగారెడ్డిగూడలో కూలిన ఇంటిని పరిశీలిస్తున్న ఆర్‌ఐ ఖదీర్


ఊట్కూరు మండలం చిన్నపొర్లలో కూలిన మట్టి ఇల్లును పరిశీలిస్తున్న ఎంపీటీసీ రవిప్రసాద్‌రెడ్డి



కట్టిపడేసిన.. కత్వ

నారాయణపేట జిల్లా కోస్గి మండలంలోని ముంగిమళ్ల పరిధిలోని రామస్వామి కత్వ అలుగు పారుతూ నీటి పరవళ్లతో జలపాతాన్ని తలపించింది. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పెద్దఎత్తున వరద రావడంతో రామస్వామి కత్వ పొంగిపొర్లి.. చూపరులను కట్టిపడేసింది. పెద్దఎత్తున జనం జల దృశ్యాలను చూసేందుకు తరలివచ్చారు. – కోస్గి




చించోలి హైవేపైకి వరద నీరు..

గండేడ్: నాలుగు రోజులుగా కురుస్తున్న వానలకు నీళ్లు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. మహబూబ్‌నగర్-చించోలి రహదారి పనుల్లో భాగంగా మండల పరిధిలోని సల్కర్‌పేట్, రెడ్డిపల్లి గ్రామాల మధ్య కల్వర్టుల నిర్మాణం కొనసాగుతోంది. రోడ్డుకు మరో వైపు నూతన రోడ్డు నిర్మాణం చేపట్టడంతో నీళ్లు వెళ్లడానికి దారిలేకుండా పోయింది. దీంతో వర్షం నీళ్లు రోడ్డు నిలవడంతో వాహనాలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.

పోలీసులా.. రజాకార్లా?

- తప్పు చేస్తే కేసు పెట్టాలి.. కొట్టే హక్కు వారికెక్కడిది?
- ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి

సాక్షి, నాగర్‌కర్నూల్: జిల్లాలోని పోలీసులు నిజాం కాలంలోని రజాకార్లలా వ్యవహరిస్తున్నారని ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి మండిపడ్డారు.30 ఏళ్లుగా తనవెంటే ఉన్న నాయకుడు కృష్ణారెడ్డిని దొంగను చూసినట్టు పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లి ఆయనపై చేయి చేసుకునే హక్కు ఎవరిచ్చారని ప్రశ్నించారు. ఎవరైనా తప్పు చేస్తే అందుకు శిక్ష అనుభవించాల్సిందేనని, అయితే పోలీసులకు కొట్టే అధికారం ఎవరిచ్చారని అన్నారు. వ్యక్తులు తప్పు చేస్తే పోలీసులు కేసు నమోదు చేసి చార్జిషీట్ దాఖలు చేయాలని చెప్పారు. అంతేకాని ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా మాట్లాడితే పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లి కొట్టడం అమానుషమన్నారు. మొదటగా ఎమ్మెల్యేకు సంబంధించిన పీఏ సోషల్ మీడియాలో తనను దూషిస్తూ అసభ్యకరంగా పోస్టు పెట్టాడని చెప్పారు. దీనిపై స్పందించిన కృష్ణారెడ్డిపై ఎస్సై చేయి చేసుకున్నాడన్నారు. ఎమ్మెల్యే అనుచరులపై పోలీసులు కేసు పెట్టకుండా ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. తన 40 ఏళ్ల రాజకీయ జీవితంలో ఇలాంటి చిల్లర రాజకీయాలు చూడలేదని చెప్పారు. నాగం జనార్దన్‌రెడ్డితోనూ తనకు 20 ఏళ్ల పాటు వైరం కొనసాగినా ఏనాడూ తిట్టుకోలేదని వివరించారు. నాగర్‌కర్నూల్ మున్సిపాలిటీలో సగం మంది రియల్ ఎస్టేట్ వ్యాపారులకు కౌన్సిలర్లుగా ఎమ్మెల్యే అవకాశం ఇచ్చాడని చెప్పారు. వారంతా ప్రజల భూములపై పడ్డారని విమర్శించారు. ఇటీవల వట్టెంలో ఎమ్మెల్యేపై ప్రజలు తిరగబడ్డారన్నారు. తన అనుచరులు, కార్యకర్తలపై కక్షగడితే తానే స్వయంగా పోరాటానికి దిగుతానని స్పష్టం చేశారు. నియోజకవర్గంలో అరాచకాలకు ప్రజలే ఓటు ద్వారా బుద్ధిచెబుతారని చెప్పారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు హబీబ్, కావలి శ్రీను, తిరుపతయ్య, రాంచందర్ పాల్గొన్నారు.

పోలీసులే బీఆర్‌ఎస్‌ను ముంచుతారు

రాష్ట్రంలోని పోలీస్ వ్యవస్థనే బీఆర్‌ఎస్ పార్టీని ముంచుతుందని దామోదర్‌రెడ్డి అన్నారు. వారి అరాచకాలతో పార్టీకి ఇబ్బందులు ఎదురవుతాయని గతంలో సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌కు చెప్పినా వాళ్లు సర్దుకునే పరిస్థితుల్లో లేరని చెప్పారు. పోలీసులు పక్షపాతంగా వ్యవహరిస్తూ ఎమ్మెల్యేల మెప్పుకోసమే పనిచేస్తున్నారని చెప్పారు. పోలీసుల తీరుతో చాలామందికి అన్యాయం జరుగుతోందని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఎమ్మెల్యేలు చెబితేనే పోలీసులకు పోస్టింగులు ఇచ్చే పరిస్థితి నెలకొందన్నారు. త్వరలో కొల్లాపూర్‌లో నిర్వహించే సభలో కాంగ్రెస్ అగ్రనేత ప్రియాంకా గాంధీ సమక్షంలో పార్టీలో చేరనున్నట్టు తెలిపారు.

డ్రంకెన్‌డ్రైవ్‌లో ముగ్గురికి జైలు శిక్ష

మహబూబ్‌నగర్ క్రైం: మద్యం తాగి వాహనాలు నడిపిన ముగ్గురు వాహనదారులకు జైలు శిక్షతో పాటు జరిమానా విధించిన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఇటీవల చేసిన డ్రంకెన్‌డ్రైవ్‌లో మద్యం తాగి మొల్గరకు చెందిన మల్లికార్జున్, వినోద్, వీరన్నపేటకు చెందిన అనిల్ వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారు. ఈ ముగ్గురిని శుక్రవారం కోర్టులో హాజరు పరుచగా న్యాయమూర్తి డీ నిర్మల ఒక్కొక్కరికి ఒక రోజు జైలు శిక్ష, రూ.6వేల జరిమానా విధించారు. జైలు శిక్ష పడిన ముగ్గురు వాహనదారులను వన్‌టౌన్ పోలీసులు జిల్లా జైలుకు తరలించారు.

ప్రేమ పేరుతో మోసం చేసిన వ్యక్తికి పదేళ్లు జైలు

మరికల్: బాలికను ప్రేమ పేరుతో మోసం చేసిన వ్యక్తికి శుక్రవారం నారాయణపేట జిల్లా కోర్టు జడ్జి మహ్మద్‌రఫీ 10 ఏళ్ల జైలు శిక్ష విధించారు. మండలంలోని ఎలిగండ్లకు చెందిన దాసరి శివకుమార్ అదే గ్రామానికి చెందిన బాలికను ప్రేమ పేరుతో లైంగికంగా వాడుకొని మోసం చేశాడు. ఈ కేసులో నిజనిజాలు నిరూపణ కావడంతో శివకుమార్‌కు రూ. 20 వేల జరిమానా, 10 ఏళ్ల జైలు శిక్ష విధించినట్లు ఎస్పీ వెంకటేశ్వర్లు తెలిపారు.

త్వరలోనే నూతన భవన నిర్మాణం

సాక్షి ఎఫెక్ట్..

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరులోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలను ఇంటర్మీడియట్ జిల్లా విద్యాశాఖ అధికారులు పరిశీలించారు. భవనం శిథిలావస్థకు చేరి పైకప్పు పెచ్చులూడుతున్న వైనంపై శుక్రవారం 'సాక్షి'లో 'శిథిల పిడుగు' శీర్షికన ప్రచురితమైన కథనానికి సంబంధిత అధికారులు స్పందించారు. ఈ మేరకు డీఐఈఓ వెంకటేశ్వర్లు శుక్రవారం బాలికల జూనియర్ కళాశాలలో పరిస్థితులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాల కారణంగా విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది రాకుండా చూస్తామని, వర్షపునీరు కురిసే గదుల్లో బోధన నిలిపేసేలా చూస్తామని చెప్పారు. అలాగే వారం రోజుల క్రితం హైదరాబాద్‌లో జరిగిన సమావేశంలో విద్యాశాఖ మంత్రి, కమిషనర్ తదితర అధికారులకు కళాశాల దుస్థితి గురించి ప్రత్యేకంగా వివరించామని, త్వరలోనే కొత్త భవనం నిర్మాణం కోసం చర్యలు తీసుకునే అవకాశం ఉందన్నారు. ప్రస్తుతం నెలకొన్న సమస్యలను మరోసారి జిల్లా, ఈడబ్ల్యూఐడీసీ అధికారుల దృష్టికి తీసుకెళ్తామని పేర్కొన్నారు.


కళాశాలలో గదులను పరిశీలిస్తున్న డీఐఈఓ వెంకటేశ్వర్లు

విద్యుదాఘాతంతో కిరాణ దుకాణం దగ్ధం

భూత్పూర్: మండల కేంద్రంలోని చౌరస్తాలో గురువారం రాత్రి విద్యుదాఘాతంతో కిరాణ దుకాణం దగ్ధమై, రూ.లక్ష మేర ఆస్తి నష్టమైన ఘటన చోటు చేసుకుంది. బాధితుని వివరాల ప్రకారం.. కొన్నేళ్లుగా భూత్పూర్‌లో సతీష్‌రెడ్డి కిరాణ దుకాణం నడుపుతున్నాడు. రోజూ మాదిరిగానే గురువారం రాత్రి కిరాణ దుకాణం మూసేసి ఇంటికెళ్లాడు. రాత్రి 12గంటల సమయంలో దుకాణం నుంచి పొగలు రావడాన్ని గమనించిన ఓ యువకుడు సతీష్‌రెడ్డికి ఫోన్ చేసి సమాచారం ఇచ్చాడు. వెంటనే యజమాని అక్కడికొచ్చి షట్టర్ తీయగా అప్పటికే దుకాణంలో నిత్యవసర సరుకులన్నీ కాలిపోయాయి. చుట్టు పక్కల వారు అక్కడి చేరి నీటితో మంటలు ఆర్పేశారు. దుకాణంలోని ఫ్రిజ్, కిరాణ సమాన్లు కాలిపోయాయి. ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తుండడంతో విద్యుత్ వస్తూ పోతూ ఉండడం వల్ల ఎక్కువ ఓల్టేజీ సరఫరా కావడంతో వైర్లు కాలిపోయి షాట్ సర్క్యూట్ అయ్యింది. ప్రభుత్వం నుంచి ఆర్థికంగా ఆదుకోవాలని కిరాణ దుకాణ యజమాని తాహసీల్దార్ చెన్న కిష్టన్నకు వినతి పత్రం అందజేశారు.


భూత్పూర్‌లో దగ్ధమైన సామగ్రి

ప్రాణాలు తీసిన కాల్వ గుంత


చిన్నారుల మృతదేహాల వద్ద విలపిస్తున్న కుటుంబ సభ్యులు

- కర్నె తండా కాల్వ దాటేందుకు ప్రయత్నించి నీటిలో పడిపోయిన ఇద్దరు చిన్నారులు
- మృతులిద్దరూ సోదరుల పిల్లలు


ప్రవీణ్(ఫైల్)


వైష్ణవి(ఫైల్)

ఖిల్లాఘనపురం: ప్రమాదవశాత్తు సాగునీటి కాల్వలో మునిగి ఇద్దరు చిన్నారులు మృతి చెందిన ఘటన వనపర్తి జిల్లా ఖిల్లాఘనపురం మండలంలో శుక్రవారం సాయంత్రం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. ఆముదంబండ తండాకు చెందిన ఇస్లావత్ లాలునాయక్, శ్రీనునాయక్‌లు అన్నదమ్ములు. వీరు శుక్రవారం తమ వ్యవసాయ భూమిలో వరినాట్లు వేసేందుకు ఉదయమే కుటుంబసభ్యులందరితో కలిసి పొలం వద్దకు వెళ్లారు. వర్షం వచ్చేలా ఉండడంతో మధ్యాహ్నం భోజనం చేసిన తర్వాత ఇస్లావత్ లాలు, లక్ష్మీ దంపతుల కుమారుడు ప్రవీణ్(9), ఇస్లావత్ శ్రీనునాయక్, ముత్యాలి కుమార్తె వైష్ణవి (7)ని ఇంటికి వెళ్లి నాయనమ్మ వద్ద ఉండమని తల్లిదండ్రులు పంపించారు. వారు ఇంటికి వెళ్లే దారిలో రోడ్డు పక్కనే ఉన్న కర్నె తండా ఎత్తిపోతల కాల్వ కోసం పైపులు వేసేందుకు కాంట్రాక్ట్ గుంతలు తవ్వి ఉంచారు. అయితే మూడు రోజులుగా కురుస్తున్న వర్షానికి గుంతల్లో నీళ్లు నిండాయి. ఇది గమనించని చిన్నారులు కొద్ది నీళ్లు ఉన్నాయి అనుకుని దాటేందుకు వెళ్లి.. అందులో పడిపోయారు. ఎవరూ గమనించకపోవడంతో నీటిలో మునిగి మృతి చెందారు. సాయంత్రం ఇంటికి వచ్చిన తల్లిదండ్రులు పిల్లలు కనిపించకపోవడంతో తండాలో వెతికారు. ఆచూకీ లభించకపోవడంతో దారివెంట వెతుకుతూ.. అనుమానం వచ్చి నీటి గుంతలో దిగి వెతికారు. దీంతో చిన్నారుల మృతదేహాలు కనిపించాయి. దీంతో కుటుంబసభ్యులు బోరున విలపించారు. ప్రతి రోజు కళ్లముందు ఆడుతూపాడుతూ కనిపించే చిన్నారులు విగతజీవులుగా పడిఉండడం చూసి గిరిజనులు కంటతడి పెట్టుకున్నారు. ఈ సంఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ శ్రీహరి తెలిపారు.

ముస్లింలను మభ్యపెట్టడానికే రూ.లక్ష సాయం

- టీపీసీసీ అధికార ప్రతినిధి జహీర్ అఖ్తర్



సమావేశంలో మాట్లాడుతున్న జహీర్ అఖ్తర్

స్టేషన్ మహబూబ్‌నగర్: ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ముస్లిం మైనార్టీలను మరోసారి మభ్యపెట్టడానికే లక్ష రూపాయల ఆర్థిక సాయం అందజేస్తామంటూ బీఆర్‌ఎస్ నాయకులు ప్రకటనలు చేస్తున్నారని టీపీసీసీ అధికార ప్రతినిధి జహీర్ అఖ్తర్ ఆరోపించారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల సమయంలోనే బీఆర్‌ఎస్‌కు మైనార్టీలు గుర్తుకొస్తారని విమర్శించారు. ఇప్పుడు కొత్తగా లక్షసాయం అందిస్తామంటూ చెబుతున్న ప్రభుత్వం గతంలో స్వయం ఉపాధి సబ్సిడీ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న వాటిపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ హయాంలోనే మైనార్టీలకు సంక్షేమ పథకాలు అందించినట్లు గుర్తుచేశారు. టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సంజీవ్ ముదిరాజ్ మాట్లాడుతూ కాంగ్రెస్ హయాంలో మైనార్టీలకు 4 శాతం రిజర్వేషన్లు అమలుచేశామని, దీంతో లక్షలాది మంది విద్యార్థులు లబ్ధిపొందినట్లు తెలిపారు. మంత్రి హరీష్‌రావు ముస్లింలను అవమానించినట్లుగా మాట్లాడడం సరికాదన్నారు. సమావేశంలో మీడియాసెల్ కన్వీనర్ సీజే బెనహర్, నాయకులు బెక్కరి అనిత, సిరాజ్ ఖాద్రి, లక్ష్మణ్‌యాదవ్, అజ్మత్‌అలీ, జహీర్ తదితరులు పాల్గొన్నారు.

పోక్సో కేసు నమోదు

గోపాల్‌పేట: జిల్లాకేంద్రంలో ఓ బాలికను వేధిస్తున్న యువకుడిపై శుక్రవారం పోక్సో కేసు నమోదు చేసినట్లు వనపర్తి పట్టణ ఎస్‌ఐ యుగంధర్‌రెడ్డి తెలిపారు. ఆయన కథనం మేరకు.. వనపర్తికి చెందిన ఓ బాలిక ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతోంది. కొంతకాలంగా ముజ్జు అనే యువకుడు ఆమె వెంటపడి వేధిస్తున్నాడు. బాలిక తల్లిదండ్రులు పలుమార్లు హెచ్చరించినా మార్పు రాకపోవడంతో శుక్రవారం తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ముజ్జుపై పోక్సో కేసు నమోదు చేశామని ఎస్‌ఐ వివరించారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

ఉండవెల్లి: మండలంలోని జాతీయ రహదారి రైల్వే హైలెవల్ బ్రిడ్జి నుంచి దూకి గూడ్స్ రైలు కింద పడబోయి ఒక వ్యక్తి ఆత్మహత్యా యత్నానికి పాల్పడిన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. రైల్వే హెడ్ కానిస్టేబుల్ రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. బీహార్‌కు చెందిన సత్యరాజ్ జాతీయ రహదారి రైల్వే హైలెవల్ బ్రిడ్జి నుంచి రైలు పట్టాల మీదికి దూకి గూడ్స్‌రైలు కింద పడి ఆత్మహత్య చేసుకోబోయాడు. మధ్యలో విద్యుత్ తీగలు అడ్డు తగలడంతో గూడ్స్ రైలు డబ్బాపై పడి గాయాలయ్యాయి. అతన్ని వెంటనే చికిత్స కోసం కర్నూల్ ఆస్పత్రికి తరలించారు. అనంతరం వివరాలు తెలుసుకునే ప్రయత్నం చేయగా, మతిస్థితిమితం లేని పరిస్థితిలో ఉన్నట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు. అతను రైస్ మిల్లులో పనిచేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఇదీ వీళ్ల సంస్కారం!

చంద్రబాబు, దత్తపుత్రుడు, సొంతపుత్రుడు, బావమరిది క్యారెక్టర్ ఏంటో ప్రజలకు బాగా తెలుసు

- వెంకటగిరి సభలో ప్రతిపక్షాలపై నిప్పులు చెరిగిన ఏపీ సీఎం జగన్



తిరుపతి జిల్లా వెంకటగిరిలో శుక్రవారం వైఎస్సార్ నేతన్న నేస్తం కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏపీ సీఎం వైఎస్ జగన్

సాక్షి, తిరుపతి : వలంటీర్ల వ్యవస్థ వల్ల ప్రభుత్వానికి మంచి పేరు వస్తోందన్న బాధతో, భవిష్యత్‌పై కలత చెందిన చంద్రబాబు, ఆయన దత్తపుత్రుడు, సొంతపుత్రుడు ఇష్టానుసారం మాట్లాడుతున్నారని, వీరంతా సంస్కార హీనులని ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మండిపడ్డారు. ఎండైనా, వానైనా, చలైనా, వరదలొచ్చినా, పండగ రోజైనా, సెలవురోజైనా నిక్కచ్చిగా సేవ చేస్తున్న వలంటీర్ల క్యారెక్టర్‌పై దుష్ప్రచారం చేయడం దుర్మార్గమని నిప్పులు చెరిగారు. చంద్రబాబు, ఆయన దత్తపుత్రుడు, సొంతపుత్రుడు, బావమరిది క్యారెక్టర్ ఏంటో ప్రజలకు బాగా తెలుసన్నారు. తిరుపతి జిల్లా వెంకటగిరిలో శుక్రవారం ఆయన వైఎస్సార్ నేతన్న నేస్తం ఐదో విడత నిధుల విడుదల కార్యక్రమంలో ప్రజలనుద్దేశించి మాట్లాడారు. కొనివిషయాలు మాట్లాడకూడదనుకున్నా పరిస్థితులు చూసినప్పుడు తప్పడం లేదన్నారు. ఎక్కడైనా మంచి చేస్తున్న వ్యవస్థలను, మనుషుల్ని సంస్కారం ఉన్న ఏ ఒక్కరూ అవమానించరని, కానీ మంచి చేస్తున్న మన వలంటీర్ల గురించి ఇటీవల సంస్కారం కోల్పోయి కొందరు మాట్లాడుతున్నందు వల్ల ఈ మాటలు చెప్పాల్సి వస్తోందని చెప్పారు. వలంటీర్లంతా మన ఊళ్లో, మన కళ్లెదుటే నాలుగేళ్లుగా కనిపిస్తున్నారని, మనందరికీ తెలిసిన వాళ్లేనన్నారు. ఒకటో తేదీ రాగానే సూర్యోదయాన్ని కన్నా ముందే చిక్కటి చిరునవ్వుతో తలుపుతట్టి,

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

గుడ్ మార్నింగ్ చెబుతూ ఇదిగో మీ పెన్షన్ అంటూ అవ్వాతాతలను చిరునవ్వులతో పలకరించే కుటుంబ సభ్యులు మన వలంటీర్లు అని చెప్పారు. అవినీతికి, వివక్షకు తావు లేకుండా, మనందరి ప్రభుత్వం తీసుకొస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రతి గడప వద్దకూ.. కాళ్లకు బలపం కట్టుకుని మరీ వెళ్లి.. కులం, మతం, వర్గం, ప్రాంతం చివరకు వారు ఏ పార్టీ వారు అని కూడా చూడకుండా అవ్వాతాతలకు మేలు చేస్తున్న మనవళ్లు, మనవరాళ్ల వ్యవస్థపై కొందరు తప్పుడు మాటలు మాట్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ తప్పుడు మాటలకు స్క్రిప్ట్ ఈనాడు రామోజీరావుది అయితే నిర్మాత చంద్రబాబు.. నటన, మాటలు, డైలాగులు అన్నీ దత్తపుత్రుడివి అని తెలిపారు. ఈ సభలో సీఎం జగన్ ఇంకా ఏమన్నారంటే..

నిస్సిగ్గు రాతలు

- వలంటీర్లు స్త్రీలను లోబర్చుకుంటారని ఒకరంటారు. గ్రామ వలంటీర్లు అమ్మాయిలను హ్యూమన్ ట్రాఫికింగ్ చేస్తున్నారు.. ముంబయికో, ఎక్కడికెక్కడికో పంపించేస్తున్నారు అని ఇంకొకరు నిస్సిగ్గుగా అంటారు. దీన్ని తాటికాయంత అక్షరాలతో ఈనాడు పత్రిక, సిగ్గులేని ఆంధ్రజ్యోతి పత్రిక, ఇంకో సిగ్గులేని టీవీ–5 మీడియా రాస్తాయి. ఇటువంటి వారంతా బురద జల్లుతారు. అబద్ధాలకు రెక్కలు తొడుగుతారు.
- 2.60 లక్షల మంది మన పిల్లలు గ్రామ స్థాయిలో సేవలందిస్తున్నారు. ఇందులో 60 శాతం నా చెల్లెమ్మలే. మన వలంటీర్లు అంతా కూడా చదువుకున్న సంస్కారవంతులే. వీరంతా సేవా భావంతో పని చేస్తున్నారు. ఇలాంటి మన సేవామిత్రలు, సేవారత్నాలు, సేవా వజ్రాలు అయిన మన వలంటీర్ల కేరెక్టర్‌ను తప్పుపట్టింది ఎవరో తెలుసా?
- ఒకరు పదేళ్లుగా చంద్రబాబుకు వలంటీర్‌గా పని చేస్తున్న ప్యాకేజీ స్టార్. ఇంకొకరు చంద్రబాబు నాయుడు. మరొకరు ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ5. వీరంతా ఒక గజదొంగల ముఠా. వీళ్లు వలంటీర్ల క్యారెక్టర్ గురించి మాట్లాడుతున్నారు. వలంటీర్ పిల్లల కేరెక్టర్ ఎలాంటిదో అదే గ్రామంలో వారి సేవలందుకుంటున్న కోట్ల మందికి తెలుసు.

వీరికి మంచి చేసిన చరిత్రే లేదు

- ఎందుకు ఈ స్థాయికి దిగజారిపోయారంటే వీరికి మంచి చేసిన చరిత్ర లేదు. ఫలానా మంచి చేశాం.. అందుకే మాకు తోడుగా ఉండండి అని చెప్పుకోవడానికి కూడా ఒక్కటంటే ఒక్కటి మంచి చేసిన చరిత్ర లేదు. ఉన్నదంతా వంచన, వెన్నుపోట్లు మాత్రమే. ఇదీ వీళ్ల జీవిత చరిత్ర.

కేంద్రం నయాపైసా ఇవ్వలేదు..

- మోదీ సర్కారుకి ఎన్నో అంశాల్లో మద్దతు ఇచ్చాం.. కానీ ఏ ఒక్క హామీ నెరవేర్చలేదు: మంత్రి కేటీఆర్

సాక్షి, హైదరాబాద్: ఎన్నో అంశాల్లో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి మద్దతు ఇచ్చినా విభజన చట్టంలో పేర్కొన్న ఏ ఒక్క హామీనెరవేర్చ లేదని మంత్రి కేటీరామారావు అన్నా రు. నీతి ఆయోగ్ సిఫారసు చేసిన ప్పటికీ తెలంగాణకు కేంద్రం నయాపైసా ఇవ్వడం లేదన్నారు. మర్రిచెన్నారెడ్డి మానవ వనరుల అభి వృద్ధి కేంద్రంలో శుక్రవారం 'అభయ్ త్రిపాఠీ స్మారక ఉపన్యాసం'లో భాగంగా 'కొత్త రాష్ట్రం.. సవాళ్లు' అనే అంశంపై కేటీఆర్ ప్రసంగించారు. రాష్ట్రం నుంచి కేంద్రానికి వెళ్లే మొత్తంలో తిరిగి 46% మాత్రమే రాష్ట్రా నికి వస్తోందన్నా రు. ప్రతీ జిల్లాలో వైద్య కళాశాల ఏర్పాటు చేసిన రాష్ట్రం తెలంగాణ మాత్రమేనని పేర్కొన్నారు.

ఐటీలో బెంగుళూరును అధిగమించాం

ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ రంగం పురోగతి ద్వారా యువత ఆలోచన ధోరణిలో మార్పు వచ్చిందన్నారు. 30 ఏళ్ల వయసులోపే ఐటీ ఉద్యో గులు సొంత ఇళ్లు కొనుగోలు చేస్తుండటమే దీనికి నిదర్శనంగా కేటీఆర్ పేర్కొన్నారు. ఐటీ ఉద్యోగాల కల్పనలో బెంగుళూరును హైదరాబాద్ రెండేళ్లుగా అధిగమిస్తోందన్నారు. నీళ్లు, నిధులు, నియామకాలు నినాదంతో ఉద్య మించి సాధించిన తెలంగాణ రాష్ట్రంలో సమగ్ర, సమీకృత, సమతుల అభివృద్ధిని సాధించామని మంత్రి కేటీ రామారావు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు సందర్భంగా ఎదురైన సవాళ్లు, సందేహా లను పటాపంచలు చేసి అందరూ శాంతియుత వాతావరణంలో జీవించేలా పాలన సాగుతోందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు మూలంగా ఉత్తర తెలంగాణ సస్యశ్యామలమైందని, మిషన్ భగీరథ లాంటి పథకాలను కేంద్రం, ఇతర రాష్ట్రాలు కాపీ కొడుతున్నాయని కేటీఆర్ అన్నారు.

రూ.5 కోట్లు ఇవ్వకుంటే అంతుచూస్తా

- ఓ బిల్డర్‌ను బెదిరించిన ఇంజనీరింగ్ కాలేజీ డైరెక్టర్
- బాధితుడి ఫిర్యాదుతో నిందితుడిని అరెస్ట్ చేసిన పోలీసులు



చంద్రశేఖర్

బంజారాహిల్స్: 'నీపై చాలా ఫిర్యాదులు ఉన్నాయి. వాటిపై అధికారులు దృష్టిపెట్టారు. నాకు రూ.5 కోట్లిస్తే అధికారులతో మాట్లాడి సెటిల్ చేయిస్తా' అంటూ ఓ బిల్డర్‌ను పలుమార్లు డబ్బు డిమాండ్ చేసిన బాచుపల్లిలోని డీఆర్‌కే ఇంజనీరింగ్ కాలేజీ డైరెక్టర్ మన్నెం చంద్రశేఖర్ (44)ను బంజారాహిల్స్ పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. బాధితుడి కథనం ప్రకారం బంజారాహిల్స్ రోడ్ నంబర్ 2లోని లుంబినీ మాల్‌లో ఉన్న శుభగృహ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ నంబూరి కల్యాణ చక్రవర్తి (40)కి మన్నెం చంద్రశేఖర్ అనే వ్యక్తి జూన్ నుంచి తరచూ ఫోన్లు చేస్తూ రూ. 5 కోట్ల కోసం డిమాండ్ చేయడం మొదలు పెట్టాడు. అయితే దీన్ని కల్యాణ్ చక్రవర్తి పెద్దగా పట్టించుకోకపోవడంతో డబ్బివ్వ కుంటే చంపేస్తానని బెది రించసాగాడు. గత నెల 6న మరోసారి ఫోన్ చేసి తాను పార్క్ హయత్‌లో ఉన్నానని.. అక్కడికి వచ్చికలవకుంటే చాలా ఇబ్బందులకు గురికావాల్సి వస్తుందని హెచ్చరించాడు. దీంతో కల్యాణ్ చక్రవర్తి హోటల్‌కు వెళ్లి చంద్రశేఖర్‌ను కలవగా మరోసారి డబ్బు కోసం పట్టుబట్టాడు. బాధితుడు అక్కడి నుంచి వెళ్లిపోయేందుకు ప్రయత్నించగా ఇప్పటికిప్పుడు రూ. 3 కోట్లు అయినా ఇవ్వకుంటే అంతుచూస్తానని బెదిరించాడు. దీంతో మన్నెం చంద్రశేఖర్‌పై చర్యలు తీసుకోవాలంటూ బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు నిందితుడిని అరెస్టు చేశారు. ఐపీసీ సెక్షన్ 387, 506 కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కిడ్నీ రాకెట్‌పై చార్జ్‌షీట్

వరంగల్ సీఐడీ పోలీసులు చార్జ్‌షీట్ దాఖలు

అశ్వారావుపేట: అంతర్జాతీయ కిడ్నీ రాకెట్‌కు సంబంధించిన కేసులో వరంగల్ సీఐడీ పోలీసులు చార్జ్‌షీట్ దాఖలు చేశారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలు శుక్రవారం 'సాక్షి'కి అందాయి. 2016లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలం నాయుడుపేటకు చెందిన మువ్వా నరేష్ బెట్టింగ్, ఇతర వ్యసనాలకు లోనయ్యాడు. డబ్బు కోసం కిడ్నీ అమ్మాలని అనుకున్నాడు. ఓ ముఠాను సంప్రదించగా, ఆ ముఠా సభ్యులు పరీక్షలు చేయించగా, అవసరమైన ఓ వ్యక్తికి నరేష్ కిడ్నీ సరిపోయింది. అయితే కిడ్నీ మార్పిడికి ఇక్కడి చట్టాలు అనుమతించలేదు. దీంతో నరేష్‌ను హైదరాబాద్ నుంచి చెన్నైకు, అక్కడి నుంచి శ్రీలంక తీసుకెళ్లి ఆపరేషన్ ద్వారా కిడ్నీ మార్పిడి చేశారు. ఈ విషయం కొన్నాళ్ల తర్వాత బయటపడగా, దమ్మపేట పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. కాగా, విచారణకు తమిళనాడు వెళ్లి వస్తుండగా జరిగిన ప్రమా దంలో దమ్మపేటకు చెందిన కానిస్టేబుల్ గోవిందు మృతి చెందగా మరో కానిస్టేబుల్ ఆంగోతు శ్రీను తీవ్ర గాయాలతో బయటపడ్డాడు. ఇదే ఘటనలో సీఐ కొండ్రు శ్రీను కూడా గాయాలయ్యాయి. అప్పట్లో ఈ కేసు తీవ్ర సంచలనం సృష్టించింది. తాజాగా సీఐడీ నమోదు చేసిన చార్జ్‌షీట్‌లో ఏ1గా మువ్వా నరేష్ పేరును చేర్చగా, సిద్దూ అలియాస్ కాస్పరాజు సురేష్, కురపన్నం బాలుస్వామి అలియాస్ కుమార్, చెన్నైకు చెందిన గోపీకృష్ణ, శ్రవణ్‌కుమార్, కొలంబోకు చెందిన కార్తీక్, కోకకంటి కిషోర్‌కుమార్‌రెడ్డి, అమ్రిష్ ప్రతాప్, డి.మరిముత్తుతోపాటు ఉరేష్‌బాయ్ అమృత్‌బాయ్ ప్రజాపతి అలియాస్ సురేష్ ప్రజాపతి పేర్లను కూడా పొందుపరిచారు.

24, 25న ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్ల కోటా విడుదల

తిరుమల: తిరుమల శ్రీవారి రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్ల ఆగస్టు, సెప్టెంబర్ నెలల కోటాను ఈ నెల 25న ఉదయం 10 గంటలకు టీటీడీ ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. అదనపు కోటా కింద 4 వేల టికెట్లను విడుదల చేస్తుంది. అలాగే అక్టోబర్ నెలకు సంబంధించి రోజుకు 15,000 టికెట్లు చొప్పున విడుదల చేయనుంది. కాగా, ఈ నెల 24వ తేదీన ఉదయం 11 గంటలకు అక్టోబర్ నెలకు సంబంధించిన శ్రీవాణి ట్రస్ట్ టికెట్లను ఆన్‌లైన్ లో విడుదల చేయనుంది. అదేరోజు మధ్యాహ్నం 3 గంటలకు వయోవృద్ధులు, వికలాంగుల దర్శన టికెట్ల కోటాను కూడా విడుదల చేస్తుంది. టీటీడీ వెబ్‌సైట్ https://tirupatibalaji.ap.gov.inలో దర్శన టికెట్లు బుక్ చేసుకోచ్చు.

ఎన్‌ఐఏ అదుపులో ఆర్కే భార్య శిరీష

ప్రకాశం జిల్లా ఆలకూరపాడులోని ఇంట్లో అదుపులోకి

- కొద్దిసేపు టంగుటూరు పోలీసుస్టేషన్‌లో ఉంచిన ఎన్‌ఐఏ
- అక్కడి నుంచి వేరే ప్రాంతానికి తరలింపు
- అరెస్టుకు కారణాలు, ఎక్కడికి తీసుకెళ్లారో చెప్పని ఎన్‌ఐఏ బృందం



టంగుటూరు: మావోయిస్టు అగ్రనేత అక్కిరాజు హరగోపాల్ (రామకృష్ణ అలియాస్ ఆర్కే) సతీమణి శిరీష అలియాస్ పద్మని కేంద్ర దర్యాప్తు సంస్థ జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) శుక్రవారం సాయంత్రం ప్రకాశం జిల్లా టంగుటూరు మండలం ఆలకూరపాడులోని ఆమె ఇంట్లో అదుపులోకి తీసుకుంది. మూడు ప్రైవేటు కార్లలో ఆలకూరపాడుకు చేరుకున్న ఎన్ఐఏ బృందం ఇంటి పనుల్లో ఉన్న ఆమెను సాయంత్రం 6 గంటల సమయంలో అదుపులోకి తీసుకుని, బలవంతంగా కారులో తరలించేందుకు ప్రయత్నించింది. ఎందుకు అరెస్టు చేస్తున్నారని ఆమె కుటుంబ సభ్యులు ప్రశ్నించినా సమాధానం చెప్పలేదు. అనంతరం ఆమెను టంగుటూరు పోలీసు స్టేషన్‌కు తీసుకెళ్లి, ఐదు నిమిషాలు అక్కడ ఉంచారు. అనంతరం సింగరాయకొండ సీఐ దాచేపల్లి రంగనాథ్, ఎస్సై శ్రీరామ్, ఒంగోలు దిశ ఎస్సై ఫిరోజ్ ఫాతిమాల సమక్షంలో ఆమెను అక్కడ నుంచి ప్రత్యేక వాహనాల్లో తరలించారు. ఎక్కడికి తీసుకెళ్లారన్నది తెలియరాలేదు. ఈ సమాచారాన్ని పోలీసులు గోప్యంగా ఉంచారు. ఆమెను ఏ కారణాలతో అదుపులోకి తీసుకున్నారో కూడా వెల్లడించలేదు.

గతంలోనూ తనిఖీ

ఆర్కే 2021 అక్టోబర్ 16న అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన కుమారుడు మున్నా సైతం ఉద్యమ బాటలో నడిచి ఎదురు కాల్పుల్లో మరణించాడు. ఆ తర్వాత 2022లో ఆలకూరపాడులో శిరీష ఇంట్లో ఎన్ఐఏ బృందం ఓసారి తనిఖీలు చేసింది. మావోయిస్టులకు సహకరించడం, నగదు సమకూర్చడం, వైద్య విద్యార్థినితో దళాలకు వైద్యం చేయించి, దళం వైపు ఆకర్షించేలా చేయడంలో శిరీషకు సంబంధం ఉందన్న ఆరోపణలతో 2022 జూలై 19న ఛత్తీస్‌ఘడ్‌కు చెందిన ఎన్ఐఏ బృందం ఆమె ఇంట్లో తనిఖీ చేసింది. ఆ సమయంలో శిరీష వైద్యం నిమిత్తం విజయవాడ వెళ్లారు. ఇంటికి తాళం వేసి ఉంది. దీంతో విరసం నేత కళ్యాణరావును తీసుకొచ్చారు. శిరీష లేకుండా తలుపులు తీయడానికి ఆయన నిరాకరించడంతో తహసీల్దార్, వీఆర్వో సమక్షంలో తాళం పగలగొట్టారు. శిరీష ఇంటి నుంచి సాధారణ షాపుల్లో దొరికే కొన్ని పుస్తకాలు, పలు సీడీలను స్వాధీనం చేసుకున్నారు.

ఇది అక్రమ అరెస్టు: కళ్యాణరావు

శిరీషను ఎన్ఐఏ అదుపులోకి తీసుకొన్నట్లు తెలుసుకున్న విప్లవ రచయితల సంఘం నేత గంగుల కళ్యాణరావు హుటాహుటిన స్టేషన్‌కు వచ్చారు. కళ్యాణరావు, ఇతర బంధువులు ఎస్సై శ్రీరామ్‌తో మాట్లాడారు. అనంతరం కళ్యాణరావు మీడియాతో మాట్లాడుతూ.. శిరీషను అక్రమంగా అరెస్టు చేశారని తెలిపారు. ఎన్ఐఏ బృందం తమ కుటుంబానికి ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా శిరీషను బలవంతంగా తీసుకెళ్లిందని, ఎక్కడ ఉంచారన్నదీ ఇప్పటివరకు తెలపకపోవడం దారుణమని చెప్పారు. ఎవరినైనా అరెస్టు చేసే ముందు కుటుంబ సభ్యులకు తెలపాలని అన్నారు. శిరీషను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. శిరీషపై పెట్టినవన్నీ బూటకపు కేసులేనని అన్నారు.

పీయూ పరీక్షలు వాయిదా

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: వర్షాల కారణంగా ప్రభుత్వం ఆదేశాలతో పాలమూరు విశ్వవిద్యాలయం పరిధిలోని కళాశాలలకు శనివారం సెలవు ఇచ్చినట్లు రిజిస్ట్రార్ గిరిజా మంగతాయారు పేర్కొన్నారు. అలాగే పీయూ పరిధిలో శనివారం జరగాల్సిన అన్ని పరీక్షలను వాయిదా వేసి.. త్వరలో కొత్త తేదీలను ప్రకటిస్తామని పేర్కొన్నారు. విషయాన్ని విద్యార్థులు గమనించాలని సూచించారు.

రెండు లారీలు ఢీ: డ్రైవర్‌కు తీవ్ర గాయాలు



ప్రమాద స్థలంలో రెండు లారీలు..

కొత్తకోట: ముందు వెళ్తున్న లారీని వెనుక నుంచి మరో లారీ ఢీకొనడంతో డ్రైవర్‌కు తీవ్ర గాయాలైన ఘటన శుక్రవారం కొత్తకోట ఎన్‌హెచ్44పై చోటు చేసుకుంది. ఎస్ఐ మంజునాథ్‌రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. హైదరాబద్ నుంచి కర్నూల్ వైపు వెళ్తున్న లారీని మరో లారీ వెనుక నుంచి బలంగా ఢీకొట్టడంతో వెనుక లారీ డ్రైవర్ వెంకట్రావుకు తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదం జరిగిన సమయంలో లారీ డ్రైవర్ క్యాబిన్‌లో ఇరుక్కుపోవడంతో ఎంతో శ్రమించి డ్రైవర్‌ను బయటకు తీశారు. డ్రైవర్ వెంకట్రావు రెండు కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని అంబులెన్స్‌లో వనపర్తి ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్టు వివరించారు.

కుప్పకూలిన వాటర్‌గ్రిడ్ పైపులైన్

- ఏడు మండలాలకు నిలిచిన మిషన్ భగీరథ నీటిసరఫరా
- పరిశీలించిన అధికారులు.. పైపులైన్ పునరుద్ధరణకు చర్యలు



అయిజ పాతబస్టాండ్‌లోని వాగులో కుప్పకూలిన వాటర్‌గ్రిడ్ పైప్‌లైన్

అయిజ: పట్టణంలోని పాత బస్టాండ్–కొత్త బస్టాండ్ మధ్య వాగుపై నూతనంగా నిర్మిస్తున్న హైలెవల్ బ్రిడ్జి పనులు వాటర్ గ్రిడ్ పైపులను కూల్చివేశాయి. గత కొన్ని రోజులుగా పాత బ్రిడ్జిని కూల్చివేసే పనులు కొనసాగుతున్నాయి. అయితే అలంపూర్ నియోజకవర్గంలోని ఏడు మండలాల్లోని వివిధ గ్రామాలకు, మూడు మున్సిపాలిటీలకు సాగునీరందించేందుకు గతంలో పాత బ్రిడ్జి పక్కన వాటర్ గ్రిడ్ పైప్‌లైన్ నిర్మాణం చేపట్టారు. నూతన బ్రిడ్జి నిర్మాణం కోసం తవ్వకాలు చేపట్టడం.. గురువారం రాత్రి కురిసిన తేలికపాటి వర్షానికే వాటర్ గ్రిడ్ పైప్‌లైన్ కుప్పకూలింది. వాటర్ గ్రిడ్ పైపు ద్వారా వచ్చిన తాగునీరు వాగు పాలయ్యింది. వెంటనే వాటర్‌గ్రిడ్ అధికారులు నీటి సరఫరాను నిలిపివేశారు. దీంతో అలంపూర్ నియోజకవర్గంలోని 7 మండలాలకు మిషన్ భగీరథ తాగునీరు నిలిచింది.

పట్టణంలో నీటి సరఫరాకు అంతరాయం

వాటర్ గ్రిడ్ పైపులు పగిలిపోవడం, వాటి మరమ్మతుకు మూడురోజులు సమయం పట్టనున్న నేపథ్యంలో పట్టణంలో మూడు రోజులపాటు తాగునీటి సరఫరా నిలిపివేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నర్సయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శని, ఆది, సోమవారాల్లో పట్టణ ప్రజలు ప్రత్యామ్నాయ పనరులను చూసుకోవాలని కోరారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

నూతన బ్రిడ్జి పనులు.. గురువారం రాత్రి కురిసిన వర్షం.. ట్రాన్స్‌ఫార్మర్ మార్పు నేపథ్యంలో త్రుటిలో ప్రమాదం తప్పింది. బ్రిడ్జి కోసం గుంతలు తవ్వే పనులు ప్రారంభించారు. అయితే, దీనికి సమీపంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ అలాగే ఉండిపోయింది. గురువారం రాత్రి కురిసిన వర్షానికి భూమి కోతకు గురై ట్రాన్స్‌ఫార్మర్ బ్రిడ్జి నిర్మాణం కోసం తవ్విన లోతైన గుంతలో పడేలా ఒరిగింది. తేరుకున్న విద్యుత్ శాఖ అధికారులు తగు చర్యలు చేపట్టారు. ఈడీఏ గోవిందు, ఏఈ బాలస్వామి సిబ్బందితో అక్కడికి చేరుకొని వెంటనే విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. అనంతరం ట్రాన్స్‌ఫార్మర్‌ను అక్కడనుంచి తొలగించారు. ఈక్రమంలో విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. అక్కడున్న ప్రజలు అప్రమత్తమై దూరంగా పరిగెత్తడంతో ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు. దీంతో ట్రాన్స్‌కో అధికారులు, పట్టణ ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

పునరుద్ధరిస్తాం

కుప్పకూలిన వాటర్ గ్రిడ్ పైప్‌లైన్‌ను రెండురోజుల్లో పునరుద్ధరిస్తామని మిషన్ భగీరథ ప్రాజెక్ట్ ఎస్ఈ జగన్‌మోహన్ అన్నారు. ఘటన స్థలాన్ని ఆయనతోపాటు ప్రాజెక్ట్ మేనేజర్ చంద్రమోహన్, వాటర్ గ్రిడ్ డీఈ నాగరాజు, ఏఈ రమేష్ పరిశీలించారు. డీఈ నాగరాజు మాట్లాడుతూ అలంపూర్ నియోజకవర్గంలోని ఇటిక్యాల మండలం మినహా మిగిలిన ఆరు మండలాల్లోని వివిధ గ్రామాలకు మిషన్ భగీరథ తాగునీటి సరఫరా నిలిచిపోయిందని అన్నారు. మొత్తం మూడు కొత్త పైపులను అమర్చాల్సి ఉందని, పైపులను ఆర్డర్ చేశామని, వచ్చిన వెంటనే కొత్త పైపులను అమర్చుతామని అన్నారు.

మైనార్టీ గురుకులంలో కళ్ల కలక కలకలం



వైద్యశిబిరం నిర్వహించి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

జడ్చర్ల టౌన్: పట్టణంలోని మైనార్టీ బాలికల గురుకుల పాఠశాలలో కళ్లకలక కలకలం రేపుతోంది. 45 మందికిపైగా విద్యార్థినులు కళ్లకలక బారిన పడ్డారు. దీంతో శుక్రవారం ఉదయం పాఠశాలలో వైద్యశిబిరం నిర్వహించి విద్యార్థులకు పరీక్షలు చేశారు. ఒకరి నుంచి మరొకరికి సోకుతుండటంతో తల్లిదండ్రుల విజ్ఞప్తి మేరకు రెండు రోజుల పాటు గురుకుల పాఠశాలకు సెలవు ప్రకటించారు. రెండు రోజుల నుంచి విద్యార్థినులు అస్వస్థతకు గురవుతున్నారు. కళ్లు మండుతుండటం, నీరు కారటం వంటి లక్షణాలు కనిపించటంతో అర్బన్ హెల్త్ సెంటర్‌లో పరీక్షలు చేయించారు. కళ్లకలకగా గుర్తించి విద్యార్థిని తల్లిదండ్రులకు సమాచారం అందించి కొందరిని ఇళ్లకు పంపించారు. ఒకరి నుంచి మరొకరికి మొత్తం 45 మందికి సోకింది. దీంతో శుక్రవారం ఉదయం అర్బన్‌హెల్త్ సెంటర్ డా.సమత, ఆర్‌బీఎస్‌కే డా.లీలు పాఠశాలలో వైద్యశిబిరం నిర్వహించి విద్యార్థినులకు పరీక్షలు చేశారు. అవసరమైన విద్యార్థులకు మాత్రలు అందజేశారు.

డీఎంఅండ్‌హెచ్ఓ సందర్శన

విషయం తెలుసుకున్న డీఎంఅండ్‌హెచ్ఓ డా.కృష్ణ పాఠశాలను సందర్శించారు. వైద్యశిబిరం పరిశీలించి వైద్యులకు పలు సూచనలు చేశారు. కళ్లకలక సోకిన విద్యార్థినులను ఇతర విద్యార్థులకు దూరంగా ఉంచాలన్నారు.

రెండు రోజులు సెలవులు

45 మంది విద్యార్థినులకు కళ్లకలక సోకటంతో ఇతర విద్యార్థినుల తల్లిదండ్రులు ఆందోళన చెంది పాఠశాలకు చేరుకున్నారు. ఒకరి నుంచి మరొకరికి సోకుతుండటంతో తమపిల్లలను ఇళ్లకు తీసుకెళ్తామని పట్టుబట్టారు. తగిన జాగ్రత్తలు తీసుకుంటామని ఉపాధ్యాయులు వారికి నచ్చజెప్పినా.. వినలేదు. తల్లిదండ్రులు ససేమిర అంటూ కొద్దిసేపు ఉపాధ్యాయులతో వాదనకు దిగారు. దీంతో పాఠశాల ప్రిన్స్‌పాల్ కల్పన ఉన్నతాధికారులకు సమాచారం అందజేశారు. స్పందించిన ఉన్నతాధికారులు రెండు రోజుల పాటు సెలవులు ఇవ్వాలని సూచించటంతో విద్యార్థులను ఇళ్లకు పంపించారు. ఇంటర్ విద్యార్థినులు మాత్రం పాఠశాలలోనే ఉండిపోగా.. కొందరు విద్యార్థినులు అనుమతి తీసుకుని ఇళ్లకు వెళ్లిపోయారు. సోమవారం తిరిగి పాఠశాలకు చేరుకోవాలని విద్యార్థినుల తల్లిదండ్రులకు చెప్పి సెలవులు ప్రకటించారు.

ఆపన్నహస్తం కోసం

- ప్రమాదంతో వీధినపడ్డ కుటుంబం
- పిల్లలు, కుటుంబ భారం భార్యపైనే..
- ఇల్లు గడవడానికే దినదినగండం..
- దాతల ఆదుకోవాలని వేడుకోలు

ఫోన్ పే నంబర్ 6281245089



మంచానికి పరిమితమైన లింగరాజుతో భార్య, పిల్లలు



తీవ్ర గాయాలతో లింగరాజు

మక్తల్: అనుకోని ఘటనలో ద్విచక్రవాహనాన్ని గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో రెండు కాళ్లు విరిగిపోయి తీవ్రంగా గాయపడిన ఓ వ్యక్తి కుటుంబం వీధిన పడింది. చికిత్స కోసం రూ.1.50 లక్షలు ఖర్చు చేసినా ఆ వ్యక్తి మంచానికే పరిమితమయ్యాడు. అన్నీ తానైన అతని భార్యపై పిల్లలు, కుటుంబ భారం మోయాల్సి వచ్చింది. ఈ క్రమంలో నిరుపేద ఆ కుటుంబం ఆపన్నహస్తం కోసం ఎదురుచూస్తోంది. మక్తల్ మున్సిపల్ పరిధిలోని చందాపూర్ గ్రామానికి చెందిన లింగరాజు మూడు నెలల క్రితం ద్విచక్రవాహనంపై వస్తున్న సమయంలో పట్టణంలోని నల్లజానమ్మ ఆలయం వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అతని రెండు కాళ్లు విరిగిపోయాయి. దీంతో చికిత్స కోసం రూ.1.50 లక్షలు ఖర్చు చేసుకున్నారు. అయినా కాళ్లు కదుపలేని పరిస్థితి ఏర్పడింది. అతనికి మంచంపైకే భోజనం, కాలకృత్యాలు తీర్చుకునే దుస్థితి దాపురించింది. అతనికి భార్య అరుణ, ముగ్గురు పిల్లలు అవళి రెండో తరగతి చదువుతుండగా.. అభిరాం(3), అనన్య(1) ఉన్నారు. ఒకపక్క పనిచేసే భర్త మంచానికే పరిమితమయ్యాడు. మరో పక్క కుటుంబ భారం ఆమెపై పడింది. పూటగడవని పరిస్థితిలో రేషన్ బియ్యంతో జీవనం గడుపుతూ ఖర్చుల కోసం కూలీపనులకు ఆమె వెళ్తోంది. ఈ పరిస్థితుల్లో చికిత్స కోసం రాయిచూర్, హైదరాబాద్‌లో చూపించినా ఫలితం లేకపోయింది. భర్త బాగున్న రోజుల్లో విద్యుత్ స్తంభాలు పాతేందుకు వెళ్లి రోజు రూ.500 తెచ్చేవాడు. ఇప్పుడు అతను మంచాన పడడంతో ఆర్థిక ఇబ్బందులు ఎక్కువయ్యాయి. ఎవరైనా దాతలు సహకరిస్తే భర్త వైద్య ఖర్చులతోపాటు ఆర్థిక భారం నుంచి ఉపశమనం కలుగుతుంది. దాతలు స్పందించి ఫోన్ పే నంబర్ 62812 45089కు ఆర్థిక సహాయం చేసి ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని పలువురు కోరుతున్నారు.

తెలంగాణలోనే కడుపునిండ తిండి, నిద్ర



రాంరెడ్డిని సన్మానిస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): తెలంగాణరాష్ట్రం ఏర్పడిన తర్వాతే రైతులు కడుపునిండా తింటున్నారని.. కంటి నిండా నిద్రపోతున్నారని నల్లగొండకు చెందిన రైతు బోర్ల రాంరెడ్డి మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌కు తెలిపారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో రామిరెడ్డి మంత్రిని కలిసి నాటికి నేటికి రాష్ట్రంలో వ్యవసాయంలో వచ్చిన మార్పును తెలియజేశారు. తనకున్న 40 ఎకరాల పొలానికి నీళ్లు లేక సమైక్య రాష్ట్రంలో 100 బోర్లు వేయించానని, అందుకే తనను అందరూ బోర్ల రామిరెడ్డి అని పిలవడం ప్రారంభించారని తెలిపారు. అప్పుడు కరెంటు సక్రమంగా లేక అర్ధరాత్రి ఎప్పుడు వస్తుందో తెలియని రోజులు ఇంకా మర్చిపోలేదన్నారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత కష్టాలన్నీ తొలగిపోయాయన్నారు. కాంగ్రెసోళ్లు చెప్పినట్లు 3గంటల కరెంటు అంటే మళ్లీ మునుపటి రోజులు తప్పవని రైతు తెలిపారు.

అయ్యయో.. ఇరుక్కుపోయానే..



డబ్బాలో ఉన్న ఆహారం తినేందుకు తాపత్రయపడిన ఓ శునకం.. దాని వెనక ఉన్న ప్రమాదాన్ని పసిగట్టలేకపోయింది. శుక్రవారం ఉదయం మిడ్జిల్‌లోని ఓ హోటల్ ఎదుట ఉన్న ప్లాస్టిక్ డబ్బా కనిపించడంతో శునకం అందులో ఉన్న ఆహారాన్ని అందుకునేందుకు ప్రయత్నించింది. తీరా డబ్బాలో తల ఇరుక్కుపోవడంతో నానా ఇబ్బందులు పడింది. ఎరక్కపోయి.. ఇరుక్కుపోవడం అంటే ఇదేనేమో అని స్థానికులు చర్చించుకున్నారు.. – మిడ్జిల్